క్లుప్తంగా

సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చాలి



పోలకల్ మునిస్వామి

ఆదోని టౌన్: ఎన్నికల ముందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను తక్షణమే నెరవేర్చాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పోలకల్ మునిస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన కొనసాగుతోందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ కాలయాపన చేస్తున్నారన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు యేడాది గడుస్తున్నా ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ప్రజల దృష్టి మళ్లించేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు.

ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలి



మాట్లాడుతున్న నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్ డివిజన్ అధ్యక్షుడు చార్లెస్

ఎమ్మిగనూరుటౌన్: ఆదోని మండలం ధనాపురం గ్రామ సర్పంచ్‌పై కులవివక్ష చూపిన ఆదోని బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ నాయకురాలు గుడిసె కృష్ణమ్మలపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్ డివిజన్ అధ్యక్షుడు సుమాల చార్లెస్, పట్టణ అధ్యక్షుడు ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి,టీడీపీ నాయకురాలు గ్రామ సర్పంచ్‌ను వేదికపైకి పిలవకుండా కిందే నిలబెట్టి ఎస్సీ అని పేర్కొంటూ కులవివక్ష చూపడం శోచనీయమన్నారు. తక్షణం వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

నందవరంలో వర్షం



జోహరాపురం కురుస్తున్న వర్షం

నందవరం: మండలంలో మంగళవారం వర్షం కురిసింది. వర్షాలు కురుస్తుడడంతో రైతన్నలకు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం మండలంలో నదికై రవాడి, కొత్తకై రవాడి, గంగవరం, పూలచింత, పెద్దకొత్తిలి, నాగలదిన్నె, నందవరం గ్రామాల్లో ఓ మోస్తరుగా వర్షం కురిసింది. వానలకు మండల పరిధిలో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఇప్పటికే నది తీర గ్రామాలు, బోరు బావుల వద్ద సాగు చేసిన పంటలు ఈ వర్షం ప్రాణం పోయగా పత్తి నాటిన పంటలకు అనుకూలంగా మారటంతో వ్యవసాయ పనుల్లో, విత్తులో బిజీ బిజీగా ఉన్నారు. మండలంలో దాదాపు 35,000 వేల ఎకరాల్లో పత్తి సాగైనట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

రాయచోటిలో డెంగీ కేసు నమోదు



టైర్లలో నిలిచిన నీటిని తొలగిస్తున్న దృశ్యం

నందవరం : మండల పరిధిలోని రాయచోటి గ్రామంలో డెంగీ కేసు నమోదైనట్లు మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ నరసింహులు తెలిపారు. మంగళవారం గ్రామంలో వైద్యాధికారులు, సిబ్బంది మురుగు కాలువలు, నీటి కుంటలు, టూబ్స్, టైర్లల్లో నిలిచిన నీటిని పరిశుభ్రం చేశారు. మురుగు కాలువల్లో ఎబెట్, డెంగీ వ్యాధి సోకిన వారి ఇంటితో పాటు చుట్టు పక్కన్న 50 ఇళ్లల్లో పైరిత్రమ్‌ను పిచికారీ చేయించారు. గ్రామంలోని ఓ మహిళకు జ్వరం రావడంతో కర్నూలు ఆసుపత్రిలో ఈ నెల 21న వైద్య పరీక్షలు నిర్వహించగా మంగళవారం ఫలితాలు రాగా.. డెంగీ వ్యాధి ఉన్నట్లు డాక్టర్లు నిర్ధారించారు.

బెల్లం ఊట ధ్వంసం



నాటుసారా స్థావరంపై దాడులు చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ఆదోని రూరల్: ఆదోని పట్టణ సమీప కొండల్లో సముద్రపుకుంట ప్రాంతంలో నాటుసారా బట్టీపై దాడులు చేసి 450 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ సైదులే మంగళవారం తెలిపారు. ఈ దాడుల్లో 11 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. సారా బట్టీ నిర్వాహకుడు బోయ రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఎవరైనా అక్రమంగా నాటుసారా తయారు చేసినా, అమ్మినా కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు.

- పలు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల అప్‌గ్రేడ్
- విద్యార్థులకు అనుగుణంగా లేని సౌకర్యాలు
- నాడు-నేడు పనులు పూర్తి చేయని కూటమి ప్రభుత్వం
- అసంపూర్తి గదుల్లోనే పాఠాలు
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు

స్థాయిని పెంచి..

సౌకర్యాలు మరిచి!



అసంపూర్తిగా కల్లుబావి పురపాలక ప్రాథమికోన్నత పాఠశాల



అసంపూర్తిగా ఉన్న గదిలో విద్యార్థులు

ఆదోని సెంట్రల్: ఆదోని నియోజకవర్గంలో పలు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల స్థాయిని (అప్‌గ్రేడ్) పెంచి ఉన్నత పాఠశాలలుగా చేశారు. అయితే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, టాయిలెట్స్, బెంచీలు వంటి సౌకర్యాలు లేవు. గత ప్రభుత్వం నాడు-నేడు కింద చేపట్టిన నిర్మాణాలు కూటమి ప్రభుత్వం వచ్చాక నిధులు విడుదల చేయకపోవడంతో అసంపూర్తిగా మిగిలిపోయాయి. దీంతో చేసేది ఏమి లేక అసౌకర్యాలు మధ్యనే విద్యార్థులకు విద్యా బోధన చేస్తున్నారు.

17 పాఠశాలలు అప్‌గ్రేడ్

ఆదోని నియోజకవర్గంలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్, పురపాలక, గురుకుల పాఠశాలలు 130 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 30,004 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. నియోజకవర్గంలోని 17 పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేశారు. చిన్న హరివాణం, నాగనాథనహళ్లి, హనవాళు, కడితోట,ఇస్వి, బసాపురం-104, గణేకల్లు, కుప్పగల్లు, చిన్న పెండేకల్లు, బైచిగేరి, నెట్టికల్లు, నారాయణపురం, కిలిచిన్‌పేట, కల్లుబావి, టి.సి మండిగిరి, హస్మియా ప్రాంతాలలోని పాఠశాలలు ఉన్నాయి. పాఠశాలలో కనీసం 12 గదులు ఉండాలి. అందులో ఒకటి హెడ్ మాస్టర్ రూమ్, మరొకటి స్టాఫ్ రూమ్‌కు పోనూ 10గదులు 10 తరగతులకు సరిపోతాయి. అయితే ఆయా పాఠశాలల్లో సరైన గదులులేవు. టాయిలెట్స్, బెంచీలు వంటి సౌకర్యాలు కూడా లేవు. కూటమి ప్రభుత్వం పాఠశాలల స్థాయిని పెంచింది కాని సౌకర్యాలు మాత్రం కల్పించలేక పోయిందనే విమర్శలు వినబడుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు ఉండాలని ఆయా పాఠశాలలకు గదులను మంజూరు చేసింది. చాలచోట్ల 75 శాతం పనులు పూర్తి అయ్యాయి. 25 శాతం పనులు పూర్తి చేస్తే గదులు పూర్తి అవుతాయి. ప్లాస్టరింగ్, కిటికీలు, డోర్స్, విద్యుత్తు పెయింట్ వంటి పనులు ఆగిపోయాయి.

కల్లుబావి పాఠశాలలో..

ఆదోని పట్టణంలోని కల్లుబావి ప్రాంతంలో ఉన్న పురపాలక ప్రాథమికోన్నత పాఠశాలలో 1 నుంచి 7వ తరగతి వరకు 457 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా మార్చింది. దీంతో 8, 9 తరగతులకు విద్యార్థులు చేరుతున్నారు. విద్యార్థులకు అవసరమైన గదులను కూడా కేటాయించాల్సి ఉంది. ఉన్న ఎనిమిది గదులలో ఒకటి హెచ్‌ఎం గది, స్టాఫ్ గది పోనూ మిగిలిన ఆరు గదులలో తగరతులను నిర్వహించాల్సి వస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు ఉండాలని పాఠశాలకు నాలుగు గదులను మంజూరు చేసింది. దాదాపు 75 శాతం పనులు పూర్తి అయ్యాయి. ఇంకా 25 శాతం పనులు పూర్తి చేస్తే గదులు అందుబాటులోకి వస్తాయి. కూటమి ప్రభుత్వం పనులను చేపట్టలేక పోయింది. దీంతో చేసేది ఏమి లేక అసంపూర్తి గదులలోనే విద్యార్థులకు విద్యను అందిస్తున్నారు.

క్రీడా ప్రాంగణాలు కరువు

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రీడా ప్రాంగణాలు కూడా అవసరము. అయితే చాల పాఠశాలలకు క్రీడా ప్రాంగణాలు లేవు. గ్రామీణ ప్రాంతాల్లో అయితే ఎలాగో ఒకలాగా ఆడుకుంటారు. అదే పట్టణ ప్రాంతాల్లో విద్యార్థులు ఆడుకోవడానికి తగినంత స్థలం లేక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణంలోని కల్లుబావి పురపాలక ఉన్నత పాఠశాల, కిలిచిన్‌పేటలోని పురపాలక ఉన్నత పాఠశాల, మండిగిరి టిసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆట స్థలాలు లేవు.

25 శాతం పనులు చేయాల్సి ఉంది



పాఠశాలకు గతంలో నాలుగు అదనపు తరగతి గదులు మంజూరయ్యాయి. వాటి నిర్మాణాలు కూడా దాదపు 75 శాతం పనులు పూర్తి అయ్యాయి. ఇంకా 25 శాతం పనులు అంటే కిటికీలు, డోర్స్, ప్లాస్టరింగ్, విద్యుత్తు వంటి పనులు పూర్తి చేయాల్సి ఉంది. వాటిని చేపడితే గదులు అందుబాటులోకి వస్తాయి. విద్యార్థులకు కూడా గదుల కొరత ఉండదు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రస్తుతం ఉన్న గదుల్లోనే విద్యను అందిస్తున్నాం.

–గిరిబాబు హెచ్‌ఎం, కల్లుబావి

ప్రతిపాదనలు పంపాం



అప్‌గ్రేడ్ అయిన పాఠశాలల్లో సౌకర్యాలు లేకపోతే గుర్తిస్తున్నాం. సౌకర్యాలను కల్పించే విధంగా చర్యలు చేపడుతున్నాము. ఎక్కడెక్కడ బెంచీలు, టాయిలెట్స్ వంటి సౌకర్యాలతో పాటు అదనపు గదులు అవసరమో గుర్తించి పనులను చేపట్టడానికి ప్రతిపాదనలు పెట్టాం. ఇప్పటికే అసంపూర్తి గదులపై కూడా అధికారులకు విన్నవించాం. నిధులు విడుదలైయితే అసంపూర్తిగా ఉన్న గదుల పనులను పూర్తిచేసి వినియోగంలోకి తీసుకొని వచ్చేందుకు చర్యలు చేపడుతాం

– శ్రీనివాసులు, ఎంఈఓ.

జగనన్న హయాంలోనే విద్యాభివృద్ధి



డీఎస్సీ అభ్యర్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్, పార్టీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్వర్యంలో విద్యాభివృద్ధి సాధ్యమైందని, లక్షకు పైగా సచివాలయాలతో పాటు పలు ఉద్యోగాలు కల్పించారని మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్ అన్నారు. బుట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో డీఎస్సీ అభ్యర్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన సదుపాయం 19వ రోజు మంగళవారం కొనసాగింది. ఇందులో భాగంగా డీఎస్సీ అభ్యర్థులకు మధ్యాహ్న భోజనాన్ని పార్టీ నాయకులు బజారి రెడ్డి తదితరులతో కలిసి వడ్డించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బి.బసిరెడ్డి, మహిళా నాయకులు లతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలి



కోటేకల్ వద్ద పొలం పిలుస్తోందిలో పాల్గొన్న జేడీఏ వరలక్ష్మీ, ఏడీఏ ఖాద్రి, ఏవో శివశంకర్

ఎమ్మిగనూరురూరల్: రైతులు పంటల సాగులో సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారిణి వరలక్ష్మీ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కోటేకల్, దేవబెట్ట గ్రామాల్లో ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి, ఏఓ శివశంకర్ ఆధ్వర్యంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జేడీఏ పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ అరంభమైనందున రైతులు విత్తనాల ఎంపిక, నాణ్యత ప్రమాణాలను తెలుసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని, లూజ్ విత్తనాలు కాకుండా షాపుల్లో తీసుకునేటప్పుడు బిల్లు తప్పనిసరిగా వేయించుకోవాలని సూచించారు. భూసార పరీక్షలు అధారంగా విత్తనాలు వేసుకోవాలని, విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. కౌలు రైతులు తప్పనిసరిగా కౌలు కార్డులు తీసుకోవాలని చెప్పారు.



నందవరంలో మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారిణి సరిత

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడండి

నందవరం : భూసార పరీక్షల ఆధారంగా రైతులు పంటల సాగులో ఎరువులు వాడాలని మండల వ్యవసాయ అధికారిణి సరిత సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు బోయ వెంకటేశ్వర్లు పొలంలో పత్తి పంటను పరిశీలించారు. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. పత్తి పంట సాగులో కాంప్లెక్స్ ఎరువులు దుక్కిలో వేసుకోవాలి. పైపాటుగా ఎరువులు వేయరాదని, దుక్కిలో వేసుకోవడం ద్వారా మొక్క పెరుగుదల బాగుంటుందని వివరించారు. అలాగే పత్తిలో పంచ పంట, అంతర్ పంటలు వేసుకోవడం ద్వారా చీడపీడలు, తెగుళ్ల నివారణ సాధ్యమవుతుందన్నారు. వ్యవసాయ అధికారులు సలహాలు, సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వీపీఏ త్రివేణి, ఎంపీఈఓలు రామలక్ష్మి, శ్రీనివాసులు, రైతు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండండి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ భార్గవరెడ్డి

కోసిగి: చెడు వ్యసనాలకు, చెడు స్నేహాలకు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ భార్గవరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మోడల్ పాఠశాలలో విద్యార్థులకు అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంలో భాగంగా అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల వల్ల కల్గే అనర్థలను వివరించారు. ఆయన మాట్లడుతూ.. కొంత మంది టెక్నాలజీని చెడు మార్గాలలో ఉపయోగించుకుని నేరస్తులుగా మారుతున్నారని, ఇందుకు కారణం చెడు వ్యసనాలు, చెడు స్నేహాలేనన్నారు. సెల్‌ఫోన్‌లను సరైన పద్ధతిలో ఉపయోగించుకోకుండా బంగారు భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకుని నేరస్తులుగా మారుతున్నారన్నారు. ఇలాంటి అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఆయన వెంట ఎస్‌ఐలు కార్తీక్‌సాగర్, నాగేంద్ర, పాఠశాల ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

49రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం

ఎమ్మిగనూరుటౌన్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని 49రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమని మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యునియన్ నాయకులు రాజేంద్ర, నారాయణలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు పట్టణంలోని ప్రధాన రహదారుల మీదుగా తమ సమస్యలు, ప్రభుత్వ తీరు పట్ల నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద దీక్షా శిబిరంలో వారు మాట్లాడుతూ సీనియారిటీ ప్రాతిపదికన వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేసి, హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని కోరారు.

22వ రోజుకు చేరిన సమ్మె

ఆదోని టౌన్: ఆదోని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె మంగళవారానికి 22వ రోజుకు చేరుకుంది. రాష్ట్రవ్యాప్తంగా సమ్మె 48వ రోజుకు చేరింది. కార్మికులు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు ఏ ఒక్కరికీ తల్లికి వందనం పథకం జమ కాలేదన్నారు. ఈ విషయాన్ని కార్మికులు ప్రభుత్వానికి తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు పీరాసాహెబ్, సోమన్న, అహ్మద్, వీరేష్, చంటి, కర్రెప్ప తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల సంరక్షణే ధ్యేయం



మాట్లాడుతున్న సీడీపీఓ రాజేశ్వరి దేవి

మంత్రాలయం రూరల్: చిన్నారుల సంరక్షణే ధ్యేయంగా అంగన్‌వాడీ కార్యకర్తలు పని చేయాలని సీడీపీఓ రాజేశ్వరి దేవి అన్నారు. మంగళవారం స్థానిక సీడీపీఓ కార్యాలయంలో పెద్దకడబూరు సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. పిల్లలకు భోజనం శుచి, శుభ్రతతో వండించాలని, ఆట పాటలతో కూడిన విద్యను బోధించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయకుమారి పాల్గొన్నారు.

టీడీపీకి రాజీనామా

నందవరం: టీడీపీ మండల సీనియర్ నాయకులు దేశాయ్ గురురాజ్‌రావు వ్యక్తిగత కారణాలతో టీడీపీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. అలాగే మాజీ సర్పంచ్ రామన్నగౌడ్, ఖలీల్, శివ, దానియల్, కార్యకర్తలు పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు వెల్లడించారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దే రేషన్ పంపిణీ

పెద్దకడబూరు : మండలంలో ఉన్న 65సంవత్సరాల పైబడిన వారితో పాటు దివ్యాంగులకు రేషన్ ఇంటి వద్దే పంపిణీ చేయాలని తహసీల్దారు గీతాప్రియదర్శిని సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు వృద్ధులకు, దివ్యాంగులకు రేషన్ పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. అదేవిధంగా ఇప్పటి వరకు ఈకేవైసీ చేసుకోని వారిని గుర్తించి తప్పకుండా చేసుకునేలా చూడాలన్నారు. ఇంటి వద్దకే రేషన్ పంపిణీ, ఈకేవైసీ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ జెర్మియా, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

బదిలీ ఎంపీడీఓకు సన్మానం



ఎంపీడీఓ వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న దృశ్యం

కోసిగి: బదిలీపై వెళ్లిన ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటేశ్వర్లను ఎంపీపీ ఈరన్న నాయకులతో కలిసి మంగళవారం శాలువా, పూలమాలతో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తూ మండలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఆయన వెంట నాయకులు బసిరెడ్డి, నేలకోసిగి లోకరెడ్డి, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల ఫలితమే పదోన్నతులు



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వంతో పోరాడి ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలు సాధించుకున్నట్లు ఎస్టీయూ అధ్యక్షుడు, ఫ్యాప్టో చైర్మన్ ఎల్.సాయి శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని ఎంఎస్ బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదోన్నతులు పొందిన గ్రేడ్ 2 హెచ్‌ఎంలు, పీఎస్‌హెచ్‌ఎంలకు ఎస్టీయూ ఆధ్వర్యంలో సత్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ముగిసినందున ప్రభుత్వ బడులను కాపాడుకునేందుకు ఉపాధ్యాయులు కష్టపడాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోకారి, జనార్దన్, పట్టణ అధ్యక్షుడు అడివన్న తదితరులు పాల్గొన్నారు.

12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించాలి

ఆదోని సెంట్రల్: 12వ పీఆర్‌సీ కమిషన్‌ని వెంటనే నియమించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్. సాయిశ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం గ్రేడ్ 2 హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంలుగా ఇటీవల పదోన్నతి పొందిన ఆదోని పట్టణ ఉపాధ్యాయులకు ఎస్టీయూ ఆదోని పట్టణ శాఖ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ హైస్కూల్‌లో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు నాగరాజు, సత్యనారాయణ, షఫీ, కుంపటి నారాయణ, భీమరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న సహకార సంఘం జిల్లా సీఈఓ రామాంజినేయులు

గోనెగండ్ల: సహకార సంఘాలు మరింత బలోపేతానికి రైతులు సహకరించాలని సహకార సంఘం జిల్లా సీఈఓ రామాంజినేయులు, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి కోరారు. మంగళవారం మండల కేంద్రం గోనెగండ్ల సహకార సంఘం ఆవరణలో కోఆపరేటివ్ లిటరసీ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం సహకార సంఘాలు కంప్యూటరీకరణ చెందాయని, ఇక నుంచి సహకార సంఘాల్లో ఆన్‌లైన్ సేవలు అందించడం జరుగుతుందన్నారు. రుణాల మంజూరు, చెల్లింపులు అంతా ఆన్‌లైన్ లో ఉంటుందని చెప్పారు. అలాగే సహకార సంఘాల్లో ప్రధాన మంత్రి సురక్ష బీమా, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఫసల్ బీమా యోజనకు జూలై 15లోపు ప్రిమియం కట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో అబ్కామ్ డీపీఎం వహీదా సుల్తానా, డీసీఓ వెంకటకృష్ణ, గోనెగండ్ల సహకారం సంఘం మేనేజర్ అయ్యస్వామి, సీఈఓ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

నల్లచెరువులో చేపల పెంపకం నిషేధం



రాంజల నల్లచెరువులోని నీటిని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, అధికారులు

ఆదోనిటౌన్: రాంజల నల్లచెరువులో చేపల పెంపకాన్ని నిషేధిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ సి.హెచ్.లోకేశ్వరి తెలిపారు. ఆదోని పట్టణానికి తాగునీటిని అందించే రాంజల నల్లచెరువును మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, డీఈ చలపతి, వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు ఫయాజ్ అహ్మద్, సందీప్‌రెడ్డి, డీఈ చలపతి, వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్, నాగరాజ్, మహిళా కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ చెరువులో చేపలకు కొంతమంది చికెన్ ముక్కలను వేసి పెంచుతున్నారని, దీంతో చెరువులో నీరు పాడవడమేగాకుండా ప్రజారోగ్యానికి హాని కలిగే ప్రమాదం ఉందన్నారు. ప్రజారోగ్యం దృష్ట్యా చేపల పెంపకాన్ని నిషేధిస్తున్నట్లు చెప్పారు. తుంగభద్ర జలాశయం నుంచి దిగువ కాలువు నీరు విడుదలయ్యేంతవరకు చెరువులో ఎలాంటి చేపల పెంపకం చేపట్టరాదని సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించారు.

క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను అందజేస్తున్న వైద్యాధికారులు

ఆదోని టౌన్: క్షయ వ్యాధి పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కౌన్సిలర్ నాగరత్నమ్మ, చంద్రశేఖర్‌స్వామి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనిల్ సాగర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని షరాఫ్ బజార్ యూపీహెచ్‌సీలో మరాఠ్‌వాడీలో కౌన్సిలర్‌ల ఆధ్వర్యంలో టీబీ నిర్మూలన కార్యక్రమంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. టీబీ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా పోషకాహార కిట్లను అందజేశారు. డాక్టర్ అనిల్‌సాగర్ మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, గల్లలో తెమడ మరియు రక్తం పడడం , ఛాతిలో నొప్పి, ఆయాసం తదితర లక్షణాలు ఉంటే ప్రభుత్వ ఆసుపత్రిలో గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు కృష్ణవేణి, ఆశావర్కర్లు విమల, లీలావతి, త్రివేణి, ప్రజలు పాల్గొన్నారు.

సొంత మండలాల్లో బదిలీకి అవకాశం కల్పించాలి

ఆదోని రూరల్: జీవో నంబర్ 5 ప్రకారం గ్రామ సచివాలయ ఉద్యోగులకు సొంత మండలాల్లో బదిలీలకు అవకాశం కల్పించాలని సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు తిరుమలేష్, హనుమేష్, మహాదేవ కోరారు. మంగళవారం వారు ఎంపీడీఓ కార్యాలయం నుంచి ప్లకార్డులు పట్టుకుని ర్యాలీగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ ఎమ్మెల్యే పార్థసారధిని కలిసి వినతి పత్రం అందజేశారు.

సచివాలయా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరురూరల్: గ్రామ సచివాలయాల్లో పని చేసే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి నాయకులు మాట్లాడుతూ గ్రామ సచివాలయంలో పనిచేసే ఉద్యోగులకు సొంత మండలాల్లో పనిచేసే పెసులుబాటు కల్పించాలన్నారు. ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులందరినీ ఒకేలా చూడాలన్నారు.

బదిలీలో స్థానిక మండలాలు కేటాయించాలి

నందవరం : గ్రామ సచివాలయ ఉద్యోగుల సొంత మండలాలు కేటాయించేలా బదిలీలు సవరించాలని గ్రామ వార్డు సచివాలయ సంఘం, వీర్వో సంఘం మండలాల అధ్యక్షులు రాఘవేంద్ర, రవి చంద్ర, గోవింద్, డిమాండ్ చేశారు. మంగళవారం డిటీ శశిశేఖర్, ఏఓ కృష్ణమూర్తి, పీహెచ్‌సీ డాక్టర్లు రేవతి, శ్రీలేఖకు వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు రామకృష్ణ, శేఖర్, రాములమ్మ, మల్లికార్జునగౌడ్, రాధ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులిచ్చి బదిలీలు చేపట్టాలి

ఎమ్మిగనూరుటౌన్: వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులకు పదోన్నతులిచ్చిన తరువాతనే బదిలీలు చేపట్టాలని సచివాలయ ఉద్యోగుల సంఘ నాయకులు రవికిరణ్, తిలక్‌కుమార్, సుభాష్, మల్లికార్జున, లోకనాయక్, వినోద్ డిమాండ్ చేశారు. మంగళవారం వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం, రెవెన్యూ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో ఆందోళన చేపట్టి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను కమిషనర్ గంగిరెడ్డి, తహశీల్దార్ శేషఫణికి అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు శేఖర్, సత్యరాజు, సురేష్, రియాజ్, హంపిరెడ్డి, కిరణ్ పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



స్టాక్ వివరాలు పరిశీలిస్తున్న అధికారులు

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ పాఠశాలలో తహసీల్దార్ రమేష్, మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, డిప్యూటీ ఈఓ వెంకటరమణారెడ్డి మంగళవారం సాయంత్రం తనిఖీలు చేపట్టారు. తహసీల్దార్ రమేష్ మాట్లాడుతూ నెహ్రూ మెమోరియల్ పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం సక్రమంగా అమలు కావడం లేదని ఫిర్యాదులు రావడంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీ చేయడం జరిగిందన్నారు. పాఠశాలలోని స్టాకు రూంలో నిల్వ ఉన్న బియ్యం, ఇతర వస్తువులను పరిశీలించామన్నారు. బుధవారం మరలా పాఠశాలను సందర్శించి విద్యార్థుల నుంచి స్టేట్‌మెంట్ తీసుకుంటామని చెప్పారు.